మానవుడు విచిత్ర జీవి. మహోగ్రంగా ఎగసిపడే ఆ నదీమతల్లిని చూడవల సిందే. ఒడ్డున నిలబడి చూస్తుంటే, ఒడ్డు జారి పోయిన కథలు వినలేదా — విన్నాడు!

వంతెన మీద నిలబడి చూస్తుంటే, వంతెనతో సహా జనాన్ని లాక్కు పోయిన గాథలు వినలేదా? — విన్నాడు. అయినా నదిదీ, మనిషిదీ ఓ చెల గాటం! ఆ ఆగ్రహోల మాతను చూడాలని ఓ కుతూహలం! మానవ స్మృతిపథాలలో శాంత గోదావరి కన్నా వరద గోదావరికే ప్రథమ స్థానం.

# ప్రవాహం

వివినమూర్తి



గోదావరికి నోరు లేదు.

గోదారి గాడికీ లేదు.

అయితే వాళ్ళిద్దరూ కలుసుకొంటుంటారు. కబుర్లు చెప్పుకుంటారు. ఆ సంభాషణ అర్థం చేసుకోని వాళ్ళు వాళ్ళని మూగవాళ్ళు అంటారు.

వాడికి అమ్మా నాన్నా గోదావరే.

వాడి వయసెంతో ఆ గ్రామానికి తెలీదు. అది ఏటిపాలమూరు.

వాడికి ఒళ్ళు వెచ్చబడుతుంది. ఏ మూలో పడుకుంటాడు. గాలి చేతుల గోదావరి వాడిని నిమురుతుంది.

వాడికి ఆనందం వస్తుంది. వెకిలి నవ్వూ వెర్రి వాలకమూ ఎక్కువవుతాయి. నదిలోకి గెంతుతాడు. నది వాడిని కౌగలించుకుంటుంది. ఆనందాన్ని పంచుకొంటుంది.

వారిద్దరి ఆటా పాటా ఏటిపాలమూరు గడపగడపా చెప్పుకుంటాయి.

*** *** **

"ఒరే గోదారీ! నాలుగు కావిళ్ళ నీళ్ళు పొయ్యరా పాలికాపు వచ్చినాడు ఇంకా వచ్చి తగలడలేదూ!" అంటుందో పెద్దావిడ దొడ్డిగుమ్మంలోంచి పిలుస్తూ.

"ఈ బస్తా కాంతంత సాయం పట్టరా గోదారీ-" అంటాడో సన్నకారు రైతు బండిని వాకిట్లో నిలబెట్టి మనిషికోసం ఎదురుచూస్తూ.

"కొబ్బరి బూరలు చెయ్యవా మావయ్యా-" ముక్కు చీమిడి ఎగబీలుస్తూ జారిపోతున్న లాగు పైకి లాక్కుంటూ వెంటబడుతుందో చంటి తల్లి.

" కాంతంత చక్రం తిప్పరాదురా అడ్డగాడిదలా తిర క్కపోతే!" అంటాడు వడ్రంగి బ్రహ్మం.

బ్రహ్మం చర్మం కొలిమి కాకకు నల్లబడి పోయిం టుంది. అతని నోరు పెద్దా చిన్నా అన్న భేదం లేకుండా తిట్టడంతో ఊరికి చేరువైపోయింది. అతని మనసు ఊళ్ళో కష్టానికీ, సుఖానికీ ముందుండి ఊరికి ఉమ్మడి సొత్తయిపోయింది. అతను మాట విసిరినా అవతలివాడు మొగం మాడ్చుకున్నా ఊరుకోవో- అంటూ వెళ్ళిపోతాడు. అతనో నిరంకుశుడు. నవ్వులరాయుడు, ఆత్మీయుడు.

గోదారిగాడు ఆ వూరి తల్లులకు ఓ బిడ్డ. అప్పలకు ఓ తమ్ముడు. వాడికి తిండి కావాలి, ఊరు పెడుతుంది.

పిల్లికి బిచ్చం పెట్టని అరవ షావుకారు వాడు వచ్చి ఇంటి ముందు నిలబడితే ఏది చూపిస్తే దాన్ని తీసుకో మంటాడు. వాడు ఏది తిన్నా సగం వాడి కుక్కకు పెడతాడు. వాడికి ఆ కుక్క ఓ తోక.

"ఇంతకీ ఎవరి బిడ్డడండీ వాడూ? ఏంటండీ వాడి కత?"

ఆ ప్రశ్నకు గోదావరి నవ్వుతుంది. ఏటిపాలమూరు నవ్వుతుంది.

"ఎవరి బిడ్డడయితే నేమిరా సన్నాసీ! వాడో మనిషి. నోరుంది. తిండి కావాలి. ఒళ్ళుంది, పనిచేస్తాడు. మన లెక్కలకి వాడి తిండి, వాడి పనీ అందవురా! అవి బేరసారాలకు లొంగవురా-" అంటాడో సిద్ధాంతి.

ఊరు మంచిది. వాడే నాథ. చెయ్యాలనుందా- చేస్తాడు. తినాలనుందా తింటాడు. పడుకోవాలనుందా పడుకుంటాడు. ఆడాలనుందా - ఆడుకుంటాడు.

అదో స్వచ్ఛ స్వాతంత్ర్యం. ఎవరి ఆస్తులకి వారసుడూ? ఎవరి పాపాలకు ఫలితమూ? - ఎందుకీ ప్రశ్నలు! సహించావా - వాడి స్వేచ్ఛను సహించు. మార్గదర్శకంగా ఎంచావా - అనుసరించు! అసాధ్యంగా భావించావా - కారణం భావించు! మన జ్ఞానం వల్ల మనం కోల్పోయిన దానిని - వాడు అజ్ఞానంతో ఎలా సాధించాడో గ్రహించు! మానవుడు ఆటవిక దశ నుంచీ ఇన్ని దశలు గడచినా దేనిని సాధించలేకపోయాడో - ఏ భద్రతను సంపాదించ లేకపోయాడో గమనించు! మనిషి పరుగు ఎక్కడికో యోచించు!'' అంటాడో భావకుడు.

ప్రశ్నలకూ జవాబులకూ యుగయుగాల గోదావరిదీ అదే నవ్వు!

ఈనాటి గోదారిగాడిదీ అదే పకపక!

## 2

అమ్మకు ఆగ్రహం వచ్చింది.

కాటన్ మహర్షి కట్టిన కట్టను సహించనూ- అంది. ఆ పెద్ద మనిషి నిర్దేశించిన కాల్వల్లో సాగనూ - అంది. ఉవ్వెత్తున లేచింది. ఉద్రేకంతో ఎగిసింది. లంకలని ముంచెత్తింది. గ్రామాల్లో కాలు పెట్టింది. "అమ్మా, అమ్మా''అంటూ విహ్వల హృదయాలతో భీతావహంగా అరుస్తూ దణ్ణాలు పెడుతున్న పిల్లల మీదకు గయ్యాళి తల్లిలా లేచింది.

ఏటిపాలమూరు అదలిపోయింది.

ఊరు నదికన్నా ఎత్తునే వుంది.

కాని- మానవుడు విచిత్ర జీవి. భయానకంగా మహోగ్రంగా ఎగసిపడే ఆ నదీమ తల్లిని చూడవలసిందే! భయంతో శరీరమూ మనసూ వణుకుతూనే వుంటాయి. అలాగే ఆ కోపాలతల్లిని చూడడానికి ఎదురెళ్తాడు. ఒడ్డున నిలబడి చూస్తుంటే - ఒడ్డు జారిపోయిన కథలు వినలేదా - విన్నాడు! వంతెన మీద నిలబడి చూస్తుంటే వంతెనతో సహా జనాన్ని లాక్కు పోయిన గాథలు వినలేదా - విన్నాడు. అయినా నదిదీ మనిషిదీ ఓ చెలగాటం. ఆ ఆగ్రహాల మాతను చూడాలని ఓ కుతూహలం! మానవ స్మృతి పథాలలో శాంత గోదావరికన్నా వరద గోదావరికే ప్రథమ స్థానం!

బోనులోనున్న పులిలా ఒడ్డున మూగిన జనాన్ని చూస్తోంది గోదావరి.

ఆ వేళ గోదారిగాడి ఉత్సాహం పట్టనలవి కాకుండా వుంది. 'ఊరంతా వాడిని హెచ్చరిస్తూనే వుంది. నది మీదకు వంగిన మామిడి చెట్టు కొమ్మ మీదకు యథా ప్రకారం చేరాడు వాడు. ఎర్రగా వున్న ఆ నీరు మరింత పైకి వచ్చి వేలాడుతున్న తన కాళ్ళని ముట్టాలని వాడి ఉబలాటం! అది తీరాలనే అటు గోదావరి ఇటు గోదారీ ఇద్దరి ఆశా!

ఎగువ నుంచి ఎక్కడెక్కడి గ్రామాల నుంచో గోదావరి తరలించుకు వస్తూన్న రకరకాల సామాన్ల కోసం గజ ఈతగాళ్ళు నీటిలోకి ఉరుకుతున్నారు. ఏమో! ఎవరి అదృష్టమెలావుందో! ఏం దొరుకుతుందో!

ఆ సామాన్లని కొనడానికి సాహుకార్లూ సిద్ధంగా వున్నారు. ఏమో! ఎంతెంత లాభాలు చేసుకోవచ్చునో! చవకలో కొనడం ధరలో అమ్మడం -షావుకారీ ధర్మాలు గదా!

వంగున్న కొమ్మ ఫెళ్ళున విరిగింది. గోదారి నదిలోకి జారాడు. గోదావరి వాడిని వేగంగా లాక్కుపోతోంది. గజ ఈతగాళ్ళకు గోదావరి లొంగలేదు. గోదారిగాడు అందలేదు.

'గోదారీ! గోదారీ!' నిస్సహాయంగా అరుస్తోంది ఏటిపాలమూరు.

## 3

వరద తీస్తోంది.

గోదావరి తన స్థానంలోకి జారుకుంటోంది.

నష్టాలను లెక్కవేసుకుంటోంది గ్రామం. బురద లోంచి బందలోంచి కాళ్ళు పట్టిపట్టి వేస్తూ పొలాల మీదకు వెళ్ళింది గ్రామం. దెబ్బతిన్న చేలను ఇమ్ము చేసుకోవడానికి నడుం బిగించింది గ్రామం. పడిన గోడలను మెత్తుకోడానికీ, ఊడిన అరుగులని అలుక్కోటానికీ నడుం వంచింది గ్రామం.

ఏమయ్యాడు గోదారిగాడు? ప్రశ్నించుకుంటోంది గ్రామం.

ఎత్తుకు పోయిందమ్మా గోదావరి - జవాబిచ్చుకుంటోంది తడిదేరిన కళ్ళతో గ్రామం.

వారం రోజుల తర్వాత-

''అదుగో గోదారి! అదుగదుగో గోధారి-''

ఎండు గడ్డివామిలో పడిన నిప్పురవ్వయింది ఆ వార్త.

''ఏ తల్లయినా బిడ్డని ఎత్తుకుపోతుందా-'' అంటోంది ఓ తల్లి. గోదారిగాడిని చూడటానికి జరిగింది తెలుసుకోటానికీ విరగబడింది గ్రామం! నోరుందా వాడికి - చెప్పటానికి! వాడి సంజ్ఞలకు గ్రామం అనేక కథలు చెప్పుకొంది.

కొట్టుకుపోతున్న గోదారి గాడికి ఓ కొయ్య దుంగ దొరికింది. దాన్ని ఆధారం చేసుకొని వాడు కొన్ని కోసుల తర్వాత ఓ ఒడ్డుకు చేరాడు. అక్కడా ఉందొక గ్రామం. అక్కడా వున్నారు మనుషులు! కాని గోదారి గాడికి కావలసింది ఏటిపాలమూరు. ఊరు విడవని గోదారికి ఏటిపాలమూరు ఎక్కడుందో ఎలా తెలుసు? నోరులేని గోదారికి ఏటి పాలమూరు ఎక్కడుందో ఎవరు చెపుతారు?"గతానికీ వర్తమానానికీ మధ్య మానవుడు



## ఈ వారం కథ

చేసిన ప్రయాణంలో ఏర్పర్చుకున్న నామ సంకేతాలు- కాలవ్యూహానే ఎరగని ఆటవిక దశనాటి జ్ఞానం గల గోదారిగాడికి ఎలా పట్టుబడతాయి?" ప్రశ్నిస్తాడో అనుమానాలరాయుడు.

"ఆదిమానవుడయినా కొన్నాళ్ళుండిన స్థలాన్ని వదులుకోలేక పోవడమే అనాగరిక అంశ అయింది. ఎదుగుదల కోసం మనుషులు వలస పోవడమే నాగరిక అంశ అయింది. గతాన్ని జ్ఞాపకముంచుకోవడం స్థలాన్ని గుర్తించుకోటమూ మనిషికి పట్టుబడ్డాయి. గోదారీ అంతే! వాడు నది తీసాక నది వెంబడే ఆ దుంగను మోసుకుంటూ వచ్చాడు! ఏటిపాలమూరు వాడి ముక్కుకు సోకింది. వాడి ఒంటికి తాకింది. గోదావరి నీటికి ఆ వూరి రుచి వచ్చింది. వాడి చెవికి ఆ వూరి పిలుపు వినిపించింది. కంటికి ఆ గ్రామం కనిపించింది-" సమాధానమిస్తాడో సోషియాలజిస్టు.

ఆ గ్రామానికి ఇప్పుడో కొత్త వింత ఆ దుంగ! చెట్టు మొదలుని రంపంతో కోసి వేరుచేసిన ఒక అడుగు మందం, రెండున్నరడుగుల వ్యాసంగల ముక్క అది. అందులో ఒక పెద్ద తొర్రి వుంది. దాని ఆకారం చిత్రంగా వుంది. పది మందికీ పది రూపాలుగా కనిపిస్తోంది దాని రూపం.

గోదారి జీవితంలో ఆ దుంగ ఓ ప్రధాన భాగమయింది.

దాని మీద పడుకుంటాడు. దాని మీద కూర్చుంటాడు. పువ్వులూ ఆకులూ కోసి దాని మీద పోస్తాడు. చిత్ర విచిత్ర శబ్దాలతో దాని ముందు నిలబడి నమస్కరిస్తాడు. దాని మీద ఉచ్చ పోసిందని కుక్కను ఓసారి చావగొట్టాడు.

"ప్రాణం లేని ఆ దుంగని ప్రాణమున్న మనిషి ప్రేమించడమా - ఎలాసాధ్యం?" ప్రశ్నిస్తాడో జిజ్ఞాసువు.

"ప్రాణం లేని డబ్బుని ప్రేమించి ప్రాణమున్న మనిషిని హింసిస్తావుగదా - ఇదెలా సాధ్యం?" అంటాడొక కొంటె కోణంగి.

"నువ్వు తాజ్‌మహల్‌ని ప్రేమిస్తావు, హిమాలయాలను ప్రేమిస్తావు, నదులను ప్రేమిస్తావు, నగరాలను ప్రేమిస్తావు - ఎందుకని ? వాటిలో నీకేదో అందం కనిపిస్తుంది. ఆ అందం నీకేదో ఆనందాన్ని అనుభూతం చేస్తుంది. ఆ అనుభూతి నీకు మళ్ళీ మళ్ళీ కలిగించే వాటితో నీ కేదో అనుబంధం ఏర్పడుతుంది. నీ



చూపులకో ఇంపయినదాన్ని అది ఇచ్చే అనుభూతికి ప్రతిఫలంగా ప్రేమిస్తావు. అందులో అసాధ్యమూ, అస్వాభావికమూ లేవు" అంటాడొక తాత్త్వికుడు.

గ్రామానికీ, గోదారిగాడికీ ఆ చర్చలతో సంబంధం లేదు.

ఒకడొక రోజు గోదారిగాడితో ఆ దుంగను తీసుకు పోతానని వేళాకోళానికి దిగాడు. గోదారి వాడిని వెంట దరమటం! ఊరంతా నవ్వడం!

వాడిని అప్పట్నించి ఏడిపించడం ఆ వూరి కుర్రకారుకి ఓ ఆటయింది. పెద్దవాళ్ళు నవ్వుతూనే వాళ్ళని మందలించేవారు. గోదారికి ఆ దుంగమీద మక్కువ ఇంకా ఎక్కువయింది. వాడిప్పుడు ఊళ్ళోకి రాడు. ఆ దుంగను వదలడు. గోదారి గురించీ, దుంగ గురించీ రోజుకో కథ ఊరు చెప్పుకుంటోంది.

బ్రహ్మం గమనిస్తూనే వున్నాడు.

సంక్రాంతి భోగిమంటలకు ఆ దుంగ ఎంత బాగుంటుందో అని చర్చించుకుంటున్న కుర్రాళ్ళను కూకలేస్తూనే వున్నాడు. ఒక రోజు గోదారిగాడు ఓ కుర్రాడిని పట్టుకుని చావగొడితే బ్రహ్మం గోదారిని ఆపాడు. గోదారి బ్రహ్మం రెక్కబట్టుకు తీసుకువెళ్ళాడు.

దాని మీద కూర్చుని పాదు చేసారెవరో!

చింతనిప్పుల్లా మండుతున్నాయి గోదారి కళ్ళు. వాడిని చంపేస్తానన్నట్టు సౌంజ్ఞలు చేస్తున్నాడు గోదారి. బ్రహ్మం వాడిని సముదాయించాడు. గోదారి నీళ్ళు తెచ్చి ప్రొద్దుటి నించి సాయంకాలం వరకూ దానిని కడుగుతూనే వున్నాడు.

బ్రహ్మంలోని పనివాడికి ఆ దుంగలో, దాని తొర్రితో సహా ఉపయోగించుతూ నెలవంక ఆకారంగల ఓ అద్భుతమయిన టీపాయ్ కనిపిస్తోంది.

బంగారాన్ని కేవలమూ కంటికి ఇంపయిన ఓ వస్తువని ముద్దగా దాచుకుని ఆనందించే ఆదిమ మానవుడు గోదారి. మెరిసే రాయిలా వజ్రాన్ని భావించి ఆటగా మెళ్ళో వేసుకునే ఆదిమ మానవుడు గోదారి.

ఆ బంగారాన్ని కరిగించి పోత పోసి గొలుసుగా, రకరకాల నగలుగా మార్చి అందాన్ని పెంచి విలువని పెంచే నాగరికుడు బ్రహ్మం. వజ్రాన్ని సానబెట్టి సొగసుని పెంచి విలువను చేర్చే ఆధునిక దృష్టి బ్రహ్మానిది.

4

ఆ వేళ బ్రహ్మం ఒంటినిండా పచ్చడం కప్పుకుని ముట్టు బిగించి చెంబు పట్టుకుని బయలు దేరాడు. కార్తీక మాసపు వెన్నెలలు గ్రామం మీద చల్లగా పడుతున్నాయి. చలికి మూడంకె వేసినట్టు పడుకుంది గ్రామం.

బ్రహ్మం కంటికి దుంగా, దుంగని ఆనుకుని పడుకున్న గోదారీ కనిపించారు. గోదారిగాడు మంచులో చలిలో వణుకుతున్నాడు. శీతాకాలం వస్తే ఎక్కడో ఓ చోట పశువుల పాకలోనో, గడ్డిలోనో, తన కొలిమి దగ్గరో పడుకునేవాడు. వాడి శరీరం మీద ఓ చినుగుల లాగు మాత్రం వుంది. ఈ మధ్య వాడు ఎవరింటికీ తిండి కోసం కూడా పోతున్నట్టు లేదు. ఎముకలు పైకి కనిపిస్తున్నాయి.

బ్రహ్మం మనసంతా చెరువయిపోయింది.

ఆ దుంగను వాడు ఎంతగా చూసుకుంటున్నాడు! ఫలితమేమిటి? వాడికి ఆకలి పెంచుతోంది. చలిని కల్పిస్తోంది.

బ్రహ్మం తిరిగి వస్తూ ఓ నిశ్చయానికి వచ్చాడు.

వాడి చేతిని నెమ్మదిగా తొలగించాడు. ఆ దుంగను భుజానికి ఎత్తుకున్నాడు. కుక్క ఏమనుకుందో ఏమో - గుర్రుమంటూ లేచి ఒళ్ళు విదుపుకుని బ్రహ్మం దగ్గర కొచ్చింది. బ్రహ్మం బుజ్జగింపుగా దాని మదురు నిమిరి - " పోనే ఎదవా! నీ గోదారి నాకూ గోదారే!" అన్నాడు.

అది పోయి పడుకుంది.

రాత్రికి రాత్రి దాన్ని రంపంతో కోసేశాడు. బాడిశ పుచ్చుకుని చెక్కేసాడు. చిత్రిక పట్టాడు. ఆ దుంగ

రచన అనేది ఏకైక దీక్షతో చేసినప్పుడే ఉత్తమ సాహిత్యం వెలువడుతుంది. రచయిత పొట్టపోసుకునేందుకు ఇతర వ్యాపారాల్లో నిమగ్నుడై వుంటే ఉత్తమ సాహిత్యం సృష్టికాదు. ఈనాటి సంఘంలో రచన ద్వారా పొట్టపోసుకునే అపూర్వ అవకాశం దొరికినవానికి ప్రజా జీవితం ఎడమవుతూ వుంది. ప్రజా జీవితానికి సన్నిహితంగా వుండి, రచన ద్వారా పొట్టపోసుకునే అవకాశాలు గలవారికి మంచి సాహిత్యం సృష్టించే అవకాశం కూడా వుంటుంది.

—కొడవటిగంటి కుటుంబరావు

అతని చేతిలో మైనంలా కరిగిపోయింది. ఉత్తమ ఆశ్వికుని చేతిలో పొగరుమోతు గుర్రం లొంగినట్టు లొంగిపోయింది.

తెల్లవారింది.

ఆ త్రాడుని ఉపయోగించి అతను తయారుచేసిన బల్ల ఓ కళాఖండంలా కానవస్తోంది. అది కేవలం టీపాయ్ కాదు. అభిరుచి నెరిగిన ధనవంతుని ఇంటిలో వుండదగ్గ వస్తువది. ఎంత కిడుతుందో! అదృష్టమే గదా విలువను కట్టేది!

5

చెట్లనీ, మొక్కలనీ ప్రశ్నిస్తున్నాడు. ప్రతి కొయ్యనీ, ప్రతి చెక్కనీ, ప్రతి మానునీ తడిమి తడిమి చూస్తున్నాడు. "ఏమర్రా! ఎవరన్నా చూశారా నా నేస్తాన్ని! నా నమస్తాన్ని!"

గోదారి గాడి మూగ గొంతుక వెర్రిమాపు పడింది. వాడిని వేళాకోళాలాడే కుర్రకారుకీ ఆ దుంగ ఏమయిన దన్న ప్రశ్న మిగిలిపోయింది.

మూడు రోజులయింది.

అడిగితే అన్నంపెట్టే తల్లే గాని అడిగి అన్నం పెట్టే తల్లిగాదు ఆ ఏటిపాలమూరు. ఆ దుంగ వాడి జీవితంలో ప్రవేశించాక పెళ్ళాన్ని కట్టుకున్న బిడ్డను తల్లి ఎడపెట్టినట్టు ఆ గ్రామం వాడిని కాస్తంత ఎడపెట్టింది. ఈ మూడు రోజులుగా వాడు మంచినీళ్ళు కూడా తాగలేదు.

మూడోరోజు పడవలో దిగాడు బ్రహ్మం.

అతని మొహం ఆనందంతో నిండిపోయింది. అతను ఊళ్ళోకి అడుగు పెడుతూనే 'ఏడ్రా గోదారిగాడూ?' అంటూ ప్రశ్నించాడు. 'ఏమో!' అన్నట్టు చూసింది గ్రామం. జ్ఞాపకం తెచ్చుకుంటున్నట్టు సిగ్గు పడింది

రాత్రంతా పడిన శ్రమ శరీరం మీదా - ఓ చిత్రమయిన ఆనందం మనసు మీదా కదలాడుతున్నాయి.

బ్రహ్మానికి నిద్ర కమ్ముకొచ్చింది.

గ్రామం. "అవును సుమా! వాడిని ఇక్కడ చూశాం... అక్కడ చూశాం!" అంది గ్రామం.

"గోదారిగాడు అదృష్టమంతుడ్రా! వాడికి దొరికింది కొయ్య దుంగ కాద్రా! బంగారం దొరికిందిరా తండ్రుల్లారా! వాడికి తిండంటే పెట్టాం. చిరిగిన గుడ్డంటే ఇచ్చాం. ఇదుగోన్రా! ఇవి చూశార్రా ఈ పంచెలు, ఈ దుప్పటి, ఈ బనీన్లు. ఇవన్నీ వాడికేన్రా. వెతకండ్రా వాడిని. కట్టబెట్టండ్రా వీటిని! వాడి చలి తీరుతుంద్రా! వాడెక్కడున్నాడో వెతకండ్రా."

గ్రామానికీ, బ్రహ్మానికీ గోదారి దొరికాడు. గోదారి ఒడ్డున పడున్నాడు గోదారి. వాడిని లేపారు!

"అవున్రా గోదారీ! నీ కొయ్య దుంగ మీద శ్రమపడ్డావ్రా! ఎంత చక్కని బల్లయిందనుకున్నావ్! చూసిస్తే నువ్వు దాన్ని వదలవురా! ఇంద! ఈ సొక్కా యేసుకో, ఈ పంచె కట్టుకో! ఈ దుప్పటి కప్పుకో! దాని గురించి బెంగెట్టుకోకురా! దాని ఇలవ నీకు నేరు! నాకు నేరు! ఊళ్ళో దొంగసచ్చినోడికి నేరు! వాడు దాన్ని సాయిలోపెట్టేత్తాడు. కుర్ర యెదవలకి నేరు! దాన్ని బోగిమంటలు లేపుతారాళ్ళు! పెద్దకాపులకి నేరు! నాగలికి బావుందిరా గోదారీ - అనేత్తారు. ఇందర్ని కాసుకొని నువ్వు దాన్ని అలాగే వుంచుకోలేవురా తండ్రీ!"

వాడికి బలవంతంగా చొక్కా తొడిగాడు. పంచె కట్టాడు. దుప్పటి కప్పాడు. పట్నం నుంచి తెచ్చిన నోట్లు చేతిలో పెట్టాడు.

నవ్వుకుంటూ వెళ్ళిపోయాడు బ్రహ్మం.

నాలుగు రోజులు గోదారి కనబడలేదు. గన్నేరు చెట్టు కొమ్మల మీద రాబందులు గుమిగూడుతూంటే దారిన వెళ్తున్న వారి ముక్కు పుటాలు వాసనతో బద్దలవుతూంటే గ్రామం తలెత్తి చూసింది. చెట్టు చివర కొమ్మల్లో వేలాడుతున్న ఆకారాన్ని కిందికి దించింది.

నగ్నంగా వుందా శవం. రాబందులు తినేసిన దేహం!! దాని మెడలో తెల్లని కొత్త పంచె ముడేసి వుంది.

రోజులు గడుస్తున్నాయి.

గోదారిగాడు బట్టలు విప్పుకుని ఆ చెట్టుకింద గోదారి ఒడ్డున ఏడుస్తుంటే చూశామంటారు కొందరు. దుప్పటి కప్పుకొని ఎవరినో వెంటదరిమాడంటారు కొందరు. గోదారి పిచ్చినవ్వులు రాత్రివేళ ఆ నది మీద వినబడుతున్నాయంటారు.

బ్రహ్మానికీ, గ్రామానికీ గోదారి చావు అర్థం కాలేదు.

ఆ చావు ఒక స్మృతే అయింది కాని ఒక నీతి కాలేదు.

## పాకే(ట్) స్టోరీ



ఒక పెద్ద యిండస్ట్రియలిస్టు, ఒక గొప్ప ఐ స్పెషలిస్టు చిన్నప్పుడు చాలా మంచి స్నేహితులు!

తోటి మానవుల బాధలకి విలువ నివ్వడం నేర్చుకున్న డాక్టరు పెద్దగా డబ్బు సంపాదించలేదు.

విలువలు డబ్బుతో కొలవడం అలవాటయిన ఇండస్ట్రియలిస్టు డాక్టరుతో స్నేహం తగ్గించేశాడు.

ఎక్కడన్నా కలిస్తే "హలో" మాత్రంగా ఆగిపోయేది వాళ్ళ సంభాషణ! డాక్టరుకి ఇది బాధగా వుండేది.

నడి వయస్సు దాటే నాటికి చూపు సరిగ్గా ఆనక ఒకనాడు తప్పనిసరై, డాక్టరుని కలుసుకున్నాడు ఇండస్ట్రియలిస్టు!

డాక్టరు పరీక్ష చేశాడు! క్యాటరాక్ట్! కంట్లో శుక్లాలు!

"వాటీజ్ ది ట్రబుల్?" ఆత్రుతగా అడిగాడు ఇండస్ట్రియలిస్ట్!

డాక్టరు నవ్వుతూ, "నీ కళ్ళకి పొరలు కమ్మాయి!" అన్నాడు.

—విశ్వనాథ పావనిశాస్త్రి

ఎంతటి పరిశీలనా శక్తి గలవారైనా, ఒక స్థిరమైన ప్రాపంచిక దృక్పథం లేని వారెవ్వరూ గొప్ప రచనలు చేయలేరు. గొప్ప రచయితలు ఎరిగిన వ్యక్తుల మీద జరిగిన సంఘటనలు తీసుకొని కథలు రాయరు. వాస్తవ జీవితం నుండి వారి వారి ప్రాపంచిక దృక్పథం మేరకి జీవిత వాస్తవాలు గ్రహిస్తారు. వాటిని వ్యక్తం చేసేందుకు అవసరమైన సంఘటనల్నీ, పాత్రల్నీ, సన్నివేశాలనూ సృష్టిస్తారు. అంతా కల్పనే అయినా వారి చిత్రణలో ఆ కల్పన జీవితమంత సహజంగా కనపడుతుంది.

—కాళీపట్నం రామారావు

సేకరణ :- తనుటు నాగభూషణం